క్లుప్తంగా

నీటి ఎద్దడిని పరిష్కరించండి



ఎంపీఓకు వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని బండపోసాన్‌పల్లి గ్రామంలో పదిరోజులుగా తాగునీటి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గౌరీ, నరేందర్, కుమార్ పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

చిలప్‌చెడ్(నర్సాపూర్): గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని చిలప్‌చెడ్ మండల ప్రత్యేకాధికారి మాన్యనాయక్ అన్నారు. బుధవారం స్వచ్ఛదనం – పచ్చదనంలో భాగంగా ఆయన మండల పరిధిలోని సామ్లా తండాలో పరిశుభ్రత కార్యక్రమాలు పరిశీలించారు. వెంచర్లు, లేఅవుట్‌ల్లో మొక్కలు నాటామన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బురద రోడ్డుపై వరినాట్లు



వరినాట్లు వేస్తున్న తండావాసులు

శివ్వంపేట(నర్సాపూర్): బురద రోడ్డుతో ఇబ్బందులను నిరసిస్తు తండావాసులు వరినాట్లు వేసి బుధవారం నిరసన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని నవాబుపేట నుంచి రాములు తండాకు వెళ్లే రోడ్డు బురదమయంగా మారడంతో తండా వాసులు, వ్యవసాయదారులు నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రమాదభరితంగా ఉన్న పలుచోట్ల వాహనదారులు అదుపు తప్పి పడిన సంఘటనలు అనేకం చోటు చేసుకున్నాయని వాపోయారు. నవాబుపేట నుంచి రాములు తండా వరకు రెండు కిలోమీటర్లు బీటీరోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనప్పటికీ సంబంధిత కాంట్రాక్టర్ మట్టిపోసి వదిలేయడంతో ఇబ్బందులు పడాల్సివస్తుందని ఆరోపించారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ

పాపన్నపేట(మెదక్): సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం పాపన్నపేట జూనియర్ కళాశాలలో సైబర్ నేరాలు, క్రైమ్ తదితర విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైబర్ క్రైమ్‌లకు గురైన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చిన లింకులపై క్లిక్ చేయొద్దని తెలిపారు. రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నర్సింలు, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెట్రోల్ పోసి ఇంటికి నిప్పు

నర్సాపూర్ రూరల్: పెట్రోల్ పోసి ఇంటికి నిప్పు పెట్టిన ఘటన నర్సాపూర్ మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. బాధితురాలు, పోలీసుల కథనం మేరకు.. చిన్న చితకుంట గ్రామానికి చెందిన బుర్ర లక్ష్మి ఇంటి కిటికీలో నుంచి గుర్తు తెలియని దుండగులు అర్ధరాత్రి పెట్రోల్ పోసి నిప్పు పెట్టి పారిపోయారు. గమనించిన ఆమె కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి మంటలార్పి వేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువకుడిపై హత్యాయత్నం

నర్సాపూర్ రూరల్: పంట పొలం వద్దకు వెళ్తుండగా యువకుడిపై హత్యాయత్నం జరిగిన ఘటన నర్సాపూర్ మండలం అవంచ లో బుధవారం చోటు చేసుకుంది. బాధితుడు, గ్రామస్తుల కథనం మేరకు.. అవంచ గ్రామానికి చెందిన చింతల్ చెరువు శ్రీశైలం పొలం వద్దకు నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు బైక్ పై వచ్చి కత్తితో పొడిచి బైక్ పై పారిపోయారు. శ్రీశైలంకు చిన్నపాటి గాయం కావడంతో స్థానికులు నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై లింగం తెలిపారు.

పాత పనులకు కొత్త హంగులు!



ముస్లాపూర్ తండాలో రింగులతో ట్యాంకుల నిర్మాణం



వెంకట్రావ్‌పేట పాఠశాలలో పాత బండలకు వేసిన సిమెంట్ పూత

- ఇష్టారాజ్యంగా పనులు.. పర్యవేక్షించని అధికారులు
- పీఆర్ అధికారులకు పర్సంటేజీలు..

అల్లాదుర్గం(మెదక్): ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం రూ. లక్షల్లో నిధులు మంజూరు చేసింది. కానీ పాఠశాలల్లో మాత్రం నాసిరకంగా పనులు చేసి.. అధికారులు నిధులను స్వాహా చేశారని ప్రజలు ఆరోపణలు చేస్తున్నారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన మన ఊరు – మనబడి పథకం కింద నిధులు రాని పాఠశాలలకు, ప్రస్తుత అమ్మ ఆదర్శ పథకం కింద బడుల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిధులు మంజూరు చేసింది. పనులు చేపటేందుకు ఐకేపీకి చెందిన గ్రామ సంఘం అధ్యక్షులకు అప్పగించారు. పాఠశాల చైర్మన్లుగా గ్రామ సంఘం అధ్యక్షులను ప్రభుత్వం నియమించగా.. వారు ఇష్టరాజ్యంగా పనులు చేసి, నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నారు.

నిధులు పక్కదారి పట్టకుండా, అక్రమాలు జరగకుడదనే ఉద్దేశంతో గ్రామ సంఘం అధ్యక్షులకు అప్పగిస్తే వారు కూడా అక్రమాలకు పాల్పడుతున్నారు. కొన్ని పాఠశాలలో సీఆర్‌పీలు, పాఠశాల హెచ్‌ఎంలు, స్థానిక నాయకులు తూతూ మంత్రంగాపనులు చేశారు. అల్లాదుర్గం మండలంలో 20 పాఠశాలలకు ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలలుగా ఎంపిక చేసింది. విద్యుత్, తాగునీటి సౌకర్యం, మూత్రశాలలు, మరుగుదొడ్లు, మైనర్ రిపేర్ పనులకు రూ. 60 లక్షలు మంజూరు చేసింది. ఈ పనులు గ్రామ సంఘం అధ్యక్షులు చేయాల్సి ఉండగా.. వారి బంధువులు, సీఆర్పీలు, టీచర్లు చేశారు. మండల పరిధిలోని నీలకంఠపల్లి పాఠశాలకు రూ. 5లక్షల 41 వేలు మంజూరు చేసింది. ఇందులో సంపు, కులాయిలు, మూత్రశాలలు, గదుల మరమ్మతు, విద్యుత్ పనులు చేపట్టాల్సి ఉంది. పాఠశాల గదిలో నాణ్యత లేకుండా బండలు వేసి, సంపు కోసం తవ్వి వదిలి వేశారు.

అప్పాజీపల్లి పాఠశాలకు రూ.2లక్షల28 వేలు మంజూరయ్యాయి. సంపు నిర్మించాల్సి ఉండగా, గుంత తవ్వి రింగులు వేసి సంపు నిర్మాణం చేపట్టినట్లు రికార్డులు చేశారు. పాఠశాల ఆవరణలో మొరం మట్టి వేశారు. వెంకట్రావ్‌పేట ప్రాథమికోన్నత పాఠశాలకు రూ.లక్షా 75 వేలు మంజూరయ్యాయి. పాఠశాల గదిలో బండలు ఉంటే వాటిపైనే కొత్తగా సిమెంట్ వేశారు. మూత్రశాలలకు సున్నం వేసి చేతులు దులుపుకున్నారు. తాగు నీటి వద్ద టైల్స్ వేసి నల్లాలు బిగించారని గ్రామస్తులు చెప్పారు. ముస్లాపూర్ తడాలో పీఆర్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టం వచ్చినట్లు పనులు చేశారు. సీతానగర్ తండా, నడిమితండా, గాండ్ల బావి తండా, సీతానగర్, కోమటికుంట తండా, అప్పాజీపల్లి తండా పాఠశాలలో కూడా తూతూ మంత్రంగా పనులు చేశారు.

అల్లాదుర్గంలోనే పంచాయతీరాజ్ డీఈఈ కార్యాలయం ఉన్నా.. ఒక్కసారి కూడా అమ్మ ఆదర్శ పనులను పర్యవేక్షించలేదనే విమర్శలున్నాయి. అధికారులు పనుల్లో పర్సంటేజీలు తీసుకొని ఎలా చేసినా.. రికార్డులు చేస్తున్నారని వారు తెలిపారు. చేయి తడపనిదే పీఆర్ కార్యాలయంలో ఫైల్ కదలదనే ఆరోపణలున్నాయి. కలెక్టర్ పాఠశాల పనులపై విచారణ జరిపించాలని ప్రజలు కోరుతున్నారు.

పనులు చేయిస్తాం

సక్రమంగా పనులు చేయకుంటే బిల్లులు చేయ్యం. పాత పనులు చేస్తే రికార్డులు చేయమని, మళ్లీ పనులు చేయిస్తామన్నారు. ముందుగానే నిధులు డ్రా చేసుకుంటే బాధ్యత హెచ్‌ఎంలదేనన్నారు.

– విజయ్‌గౌడ్, పీఆర్ ఏఈ

ఇంతకంటే మంచిగా చేస్తారా..?

నీలకంఠపల్లి పాఠశాలలో పనులు అధ్వానంగా చేయడంపై హెచ్‌ఎం శిరిష కాంట్రాక్టర్‌ను ప్రశ్నిస్తే.. ఇంతకంటే మంచిగా చేస్తారా అని అతను సమాధానం ఇచ్చినట్లు ఆమె చెప్పారు. ఇంజనీరింగ్ అధికారులకు 20 సార్లు ఫోన్ చేసినా.. పనులు చూడటానికి రాలేదన్నారు. అడ్వాన్స్‌గా సగం నిధులు డ్రా చేసుకొని పనులు చేయట్లేదనే ఆరోపణలు ఉన్నాయి.

అందరూ పరిశుభ్రత పాటించాలి



రామాయంపేటలో మొక్కలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్



శివ్వంపేట(నర్సాపూర్): శభాష్‌పల్లిలో మొక్క నాటి నీరు పోస్తున్న అధికారులు

- మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్

రామాయంపేట(మెదక్): అందరూ పరిశుభ్రత పాటించాలని మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్ అన్నారు. స్వచ్ఛదనం – పచ్చదనంలో భాగంగా మున్సిపల్ చైర్మన్ బుధవారం పలు వార్డుల్లో పర్యటించి సమస్యలను పరిశీలించారు. ప్రజలకు మొక్కలు పంపిణీ చేశారు. ఆయనవెంట మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్టి విజయలక్ష్మి, మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నాయకులు దత్తు, చింతల రాములు, ఇతర సిబ్బంది ఉన్నారు.

మొక్కలు నాటండి: ఎంపీఓ

శివ్వంపేట(నర్సాపూర్): గ్రామాల్లో మొక్కలు నాటి, వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని ఎంపీఓ తిరుపతిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ నరేందర్‌రెడ్డి అన్నారు. శభాష్‌పల్లి, రత్నపూర్ పాఠశాలల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా గ్రామ పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వీణ, సత్యం విద్య మందిర్ ప్రిన్సిపాల్ మహేందర్, ఫీల్డ్ అసిస్టెంట్ దామోదర్, తదితరులు ఉన్నారు.

సంపూర్ణ పారిశుద్ధ్యమే లక్ష్యంగా

కొడిపల్లి(నర్సాపూర్): సంపూర్ణ పారిశుద్ధ్యమే లక్ష్యంగా అధికారులు పని చేయాలని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం కొడిపల్లిలో స్వచ్ఛదనం పచ్చదనం పనులను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేశం, ఏపీఓ పుణ్యదాస్ తదితరులు పాల్గొన్నారు.

పనులపై ప్రత్యేక దృష్టిసారించాలి

చిన్నశంకరంపేట(మెదక్): అన్ని శాఖల అధికారులు పచ్చదనం పనులపై అన్ని శాఖల అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టాలని జెడ్పీ సీఈఓ ఎల్లయ్య ఆదేశించారు. మండల పరిషత్ కార్యాయంలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఎంపీడీఓ దామోదర్, మండల ప్రత్యేక అధికారి వెంకటయ్య ఉన్నారు.

పరిసరాల పరిశీలన

వెల్దుర్తి(తూప్రాన్): వ్యాధులు సోకకుండా ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా ఉప వైద్యాధికారి డా.జ్ఞానేశ్వర్ పిలుపునిచ్చారు. వెల్దుర్తి ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీచేసి రికార్డులు, మెడిసిన్ గది, లేబర్ రూం పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటారు. వైద్యాధికారి డా.శిరీష, సిబ్బంది ఉన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్తగా ఉండాలి

కొల్చారం(నర్సాపూర్): వర్షాకాలం సీజనల్ వ్యాధులతో జాగ్రత్తగా ఉండాలని మండల కేంద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రమేశ్ సూచించారు. వసురాం తండాలో పచ్చదనం నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ సమీపంలో బైక్ చోరీ

మెదక్ మున్సిపాలిటీ: పోలీస్‌స్టేషన్ వద్దే బైక్ చోరీకి గురైన సంఘటన బుధవారం మెదక్ పట్టణంలో బుధవారం చోటు చేసుకుంది. బాధితుడు గంటాజి గంగాధర్ కథనం ప్రకారం.. పట్టణంలోని మొదటి వార్డు ఔరంగాబాద్‌కు చెందిన గంటాజి గంగాధర్ తన గ్లామర్ బైక్‌ను బుధవారం పట్టణ పోలీస్ క్వార్టర్స్ వద్ద నిలిపి పోలీస్ స్టేషన్‌లోకి వెళ్లాడు. పోలీస్‌స్టేషన్‌లో గంటపాటు ఉన్న అతను బయటకు తిరిగి వచ్చేసరికి బైక్ కనిపించలేదు. తన బైక్ చోరీకి గురైనట్లు గుర్తించిన గంగాధర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ అవి పని చేయడం లేదని పోలీసులు చెప్పినట్లు బాధితుడు వాపోయాడు. పట్ట పగలు పోలీస్ స్టేషన్ వద్ద నుంచే బైక్ చోరీ కావడం పై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం



కొల్చారం(నర్సాపూర్): కొండల్ లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కార్మికులు



కొడిపల్లిలో జెండాను ఎగురవేస్తున్న పద్మశాలీ సంఘం మండలాధ్యక్షుడు నర్సింలు, నేతన్నలు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేట, పోతంశెట్టిపల్లి గ్రామంలో బుధవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రంగంపేట చేనేత సహకార సంఘంలో చేనేత పితామహుడు కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి చేనేత కార్మికులు పూలమాలలు వేసి, కొబ్బరికాయ కొట్టి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం డైరెక్టర్లు హరిదాస్, నారాయణ, రమేశ్ బాబు, వెంకటనారాయణ, ప్రకాష్, చందు, నాగరాజు, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

కొడిపల్లిలో..

కొడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కొడిపల్లిలో జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల పద్మశాలీ సంఘం అధ్యక్షుడు నర్సింలు ఆధ్వర్యంలో పద్మశాలీ సంఘం వద్ద భక్త మార్కండేయ మహర్షికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చేనేత పతాకాన్ని ఆవిష్కరించారు. పద్మశాలీ లు ఐకమత్యంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాల న్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా యువత ఉపాధ్యక్షుడు తిరుమలేశ్, నాయకులు దుర్గయ్య, నవీన్, శ్రీనివాస్, కృష్ణ, ఆంజనేయులు, వెంకటేశం, నర్సింలు, శంకరయ్య, గంగారాం పాల్గొన్నారు.

బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రారంభం

మెదక్ మున్సిపాలిటీ: మెదక్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌ను ఫీల్డ్ జనరల్ మేనేజర్ (తెలంగాణ) మనోజ్ కుమార్ శ్రీవాత్సవ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ బ్యాంకులో అన్ని రకాల రుణాలు తక్కువ వడ్డీకే లభిస్తాయన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ ఆఫ్ ఇండియా మెదక్ బ్రాంచ్ మేనేజర్ శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుల చేయూత



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న స్నేహితులు

చేగుంట(తూప్రాన్): స్నేహితుడి మృతితో ఇబ్బంది పడుతున్న కుటుంబానికి మిత్రులు ఆర్థిక సాయం అందించి మానవత్వం చాటుకున్నారు. మక్కరాజీపేట గ్రామానికి చెందిన జింక స్వామి అనారోగ్యంతో మృతి చెందాడు. అతడితో కలిసి చదువుకున్న పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు బాధిత కుటుంబీకులను పరామర్శించారు. ఈ సందర్భంగా రూ. 35వేలను బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో పీఈటీ మంజులత, నర్సింలు, రవీందర్, భాస్కర్, రవి, శ్రీనివాస్, సుధాకర్‌రెడ్డి, సాదుల్లా, రాజేందర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం



వెల్దుర్తి(తూప్రాన్): చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న అధికారులు



తూప్రాన్: చిన్నారులకు అన్నప్రాసన చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతికృష్ణ, అధికారులు



కొడిపల్లి(నర్సాపూర్): సలాబత్‌పూర్ అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక సీమంతాలు

జిల్లా వ్యాప్తంగా తల్లిపాల వారోత్సవాలు కొనసాగుతున్నాయి. బుధవారం ఆయా గ్రామాల్లో ర్యాలీ నిర్వహించి.. తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలే రక్షణ అని తెలిపారు. తల్లిపాలే బిడ్డ ఎదుగుదలకు పోషకాహారం అని పేర్కొన్నారు. అనంతరం ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు సామూహిక సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



నిజాంపేటలో తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ స్వరూప



మెదక్ మున్సిపాలిటీ: రాంనగర్‌లో అన్నప్రాసన నిర్వహిస్తున్న ఐసీడీఎస్ అధికారులు, టీచర్లు

బోనఫైడ్ కోసం తిప్పలు

నర్సాపూర్: అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధికారుల నిర్ణయంతో అందులో చదువుతున్న అభ్యర్థులు ఇబ్బందుల పాలవుతున్నారు. నర్సాపూర్ నియోజకవర్గ పరిధిలో అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్ మండలంలోని పెద్ద చింతకుంట గ్రామ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో కొనసాగిస్తున్నారు. కాగా ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్‌లో చదివే అభ్యర్థులకు బోనఫైడ్ సర్టిఫికెట్ అవసరమైనప్పుడు వారు చదువే స్టడీ సెంటర్‌లో తీసుకునే అవకాశం ఉండేది. ఇటీవల యూనివర్సిటీ అధికారులు తాజాగా నిబంధనలు మార్పు చేసి యూనివర్సి టీ ప్రధాన కార్యాలయంలో బోనఫైడ్ సర్టిఫికెట్ పొందాలనే నిబంధనలు తేవడంతో తాము ఇబ్బందులకు గురవుతున్నామని ఓపెన్ యూనివర్సిటీ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈవిషయమై ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ దామోదర్‌ను వివరణ కోరగా.. అంబేడ్కర్ ఓపె న్ యూనివర్సిటీ అధికారుల కొత్త నిబంధనల మేరకు ఓపెన్ యూనివర్సిటీ ప్రధాన కార్యాయంలో బోనఫైడ్ సర్టిఫికెట్ పొందాల్సి ఉంటుందన్నారు. తాము జారీ చేసే వీలు లేదని చెప్పారు.

సంక్షిప్త వార్తలు

◆ చలో ఢిల్లీ

కొడిపల్లి(నర్సాపూర్): హలో మాల, చలో ఢిల్లీ కార్యక్రమానికి మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు కల్లూరి సంజీవ, మండలాధ్యక్షుడు సీరుడి కుమార్ ఢిల్లీకి తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మూడు రోజులపాటు ఢిల్లీలోని జంతర్ మంతర్‌లో జరిగే సామాజిక దీక్షలో పాల్గొననున్నట్లు తెలిపారు.

◆ 8 నుంచి ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు

పాపన్నపేట(మెదక్): ఈ నెల 8 నుంచి ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు ప్రారంభమవుతాయని కో ఆర్డినేటర్ మహేశ్వర్ తెలిపారు. సెప్టెంబర్ 10 వరకు టెన్త్, ఇంటర్‌ల్లో అడ్మిషన్లు పొందవచ్చన్నారు. వివరాలకు 9912335581కు ఫోన్ చేయాలన్నారు.

◆ పాఠశాలకు బీరువ బహూకరణ

కొడిపల్లి(నర్సాపూర్): మండలంలోని భుజిరంపేట ఉన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన పట్లోళ్ల సురేష్ తన తల్లి దేవమ్మ జ్ఞాపకార్థం బీరువ బహూకరించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రవీందర్, ఉపాధ్యాయులు సురేష్‌ను సన్మానించారు.

◆ 5న రక్తదాన శిబిరం

నర్సాపూర్: దివంగత వాకిటి లక్ష్మారెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని ఈనెల 15న రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి చెప్పారు. లక్ష్మారెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని పట్టణంలోని చాముండేశ్వరీ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేశామన్నారు. లక్ష్మారెడ్డి అభిమానులు, బీఆర్‌ఎస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదాన శిబిరం విజయవంతం చేయాలని కోరారు.

◆ రెడ్డిపల్లిలో ఉచిత వైద్యశిబిరం

చేగుంట(తూప్రాన్): మండలంలోని రెడ్డిపల్లిలో బుధవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి ఆస్పత్రి వైద్యసిబ్బంది 168 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులను అందించారు. 63 మందికి ఆపరేషన్లు అవసరం ఉండగా.. వారిని ఆస్పత్రికి తరలించి ఉచితంగా ఆపరేషన్‌లు నిర్వహిస్తామని పీఆర్వో సాయి తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు త్రిభువన్, రుత్విక్, లయన్స్ అధ్యక్షుడు నాగరాజు, లయన్స్ ప్రతినిధులు ఆకుల సుకేందర్, రమేశ్, రాంరెడ్డి, నాగరాజు, సంజీవ్, నగేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ కాల్ మాట్లాడిస్తానని.. సెల్‌ఫోన్ చోరీ

శివ్వంపేట(నర్సాపూర్): కాల్ మాట్లాడిస్తానని.. సెల్‌ఫోన్ తీసుకొని చోరీకి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ సంఘటన మండల కేంద్రమైన శివ్వంపేటలో చోటు చేసుకుంది. మండల పరిధిలోని కొత్తపేటకు చెందిన సుండు కృష్ణయ్య ను శివ్వంపేట పెద్ద చెరువు కట్ట వద్ద గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి తన స్నేహితుడికి ఫోన్ చేసుకుంటానని సెల్‌ఫోన్ ఇవ్వాలని కోరారు. అందుకు కృష్ణయ్య అతనికి సెల్‌పోన్ ఇవ్వగానే మాట్లాడినట్లు చేసి సెల్‌పోన్‌తో ఉడాయించాడు. బాధితుడు శివ్వంపేట పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేస్తున్నారు.

◆ బోరు హద్దులు చూపండి

టేక్మాల్(మెదక్): మండలంలోని సర్మోనికుంటతండా పరిధిలోని చెరువు శిఖంలో ఉన్న బోరు హద్దులు చూపాలని తండాప్రజలు బుధవారం తహసీల్దార్ కృష్ణకు వినతిపత్రం అందించారు. బోరుకు హద్దులు చూపి, తండా పంచాయతీ పరిధిలోకి తీసుకురావాలని కోరారు. ఇందులో మాజీ సర్పంచ్ రాజునాయక్, నాయకులు రమేష్ నాయక్ తదితరులు ఉన్నారు.

◆ కార్మికుల సమస్యలపై చర్చించాలి

నేడు పంచాయతీ కార్మికుల ఒకరోజు సమ్మె

మెదక్ కలెక్టరేట్: పంచాయతీ కార్మికుల సమస్యలను అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సమ్మ డిమాండ్ చేశారు. బుధవారం మెదక్‌లో ఆమె మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ కార్మికులు తమ సమస్యల పరిష్కారానికి గురువారం ఒక రోజు సమ్మె నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా జిల్లాలోని అన్ని మండలాల్లో సమ్మె నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వం కనీస వేతనాలతో న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఒక రోజు సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని పంచాయతీ కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

◆ రైతులకు ఈజీఎస్ వరం

పెద్దశంకరంపేట(మెదక్): రైతులకు ఈజీఎస్ పథకం వరం లాంటిదని ఎంపీడీఓ రఫీఖ్‌ఉన్నీసా అన్నారు. బుధవారం మండల పరిధిలోని ముసాపేట గ్రామంలో ఫాంపండ్, హార్టికల్చర్ ప్లాంటేషన్ పనులను ఆమె పరిశీలించారు. రైతులు తమ పంట పొలాల వద్ద పండ్ల తోటల పెంపకం చేసుకోవాలన్నారు. ఈజీఎస్ ఆధ్వర్యంలో అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ షకీల్, ఈపీఓ నవాజుద్దీన్, టీఏ మోహన్, ఫీల్డ్ అసిస్టెంట్ నర్సింలు తదితరులు ఉన్నారు.

◆ మండలంలో భారీ వర్షం

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో బుధవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి చిరుజల్లులతో మొదలైన వర్షం మధ్యాహ్నం భారీగా కురవడంతో లోతట్టు కాలనీలు జలమయమయ్యాయి.

◆ దోమతెర అందజేత

నర్సాపూర్ రూరల్: మండలంలోని రుస్తుంపేట అంగన్‌వాడీ కేంద్రం పిల్లలకు ఐకేపీ ఆధ్వర్యంలో దోమతెర అందజేశారు. వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం గౌరీశంకర్, గ్రామస్థాయి సిబ్బంది ఉన్నారు.

◆ ట్రాక్టర్ నుంచి బ్యాటరీ చోరీ

శివ్వంపేట(నర్సాపూర్): పొలంలో నిలిపిన ట్రాక్టర్ నుంచి బ్యాటరీ చోరీ చేసిన సంఘటన మండల పరిధిలోని ఎదుల్లాపూర్ గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వెంకటేష్ తన ట్రాక్టర్‌తో దున్నిన తర్వాత పొలంలోనే ట్రాక్టర్ నిలిపి ఉంచాడు. గుర్తు తెలియని వ్యక్తులు ట్రాక్టర్ నుంచి అర్ధరాత్రి బ్యాటరీని చోరీ చేసినట్లు బాధితుడు తెలిపాడు.

◆ సన్మానం

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని జీడిపల్లి ప్రాథమిక పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు బుధవారం సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పద్మ, పాఠశాల కమిటీ చైర్మన్ లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, గ్రామ యువకులు రాజు, శ్రీకాంత్, నవీన్, నాగరాజు, అరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

◆ ఎన్‌ఎస్‌ఎస్ అధికారిగా బాలాగౌడ్

రామాయంపేట(మెదక్): రామాయంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారిగా కళాశాలకు చెందిన లెక్చరర్ బాలాగౌడ్ నియమితులయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ హిమజ్యోతి నియామకపత్రం అందజేశారు.

◆ కార్యకర్తలకు అండగా ఉంటా

హవేళిఘణాపూర్(మెదక్): ఆపదలో ఉన్న కార్యకర్తలకు అండగా ఉంటానని మైనంపల్లి హన్మంతరావు అన్నారు. బుధవారం మండలంలోని వాడి గ్రామానికి చెందిన ప్రతాప్‌రెడ్డి అనారోగ్యానికి గురికాగా ఆయన్ను పరామర్శించారు. అనంతరం గాజిరెడ్డిపల్లి గ్రామ శివారులో ఉన్న రేణుకా ఎల్లమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. నిర్వాహకులు ఆలయ నిర్మాణానికి గౌడ సంఘం సభ్యులకు రూ. లక్ష అందజేశారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, మహేందర్‌రెడ్డి, పరశురామ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.